క్లుప్తంగా

ఎన్నికల నిర్వహణకు అడ్‌హాక్ కమిటీ నియామకం

కాకినాడ లీగల్: రాష్ట్రంలోని బార్ అసోసియేషన్‌లలో ఈ నెల 31లోగా ఎన్నికలు నిర్వహించాలని గత నెల రాష్ట్ర బార్ కౌన్సిల్ సెక్రటరీ బి.పద్మలత సర్క్యులర్ ఇచ్చారు. కాకినాడ బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకూ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో న్యాయవాదులను అడ్‌హాక్ కమిటీగా రాష్ట్ర బార్ కౌన్సిల్ నియమించింది. ఇందులో కాకినాడ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు మహ్మద్ జవహర్‌అలీ, ఎ.వెంకటేష్, టీపీఆర్ చంద్రశేఖర్, కేఆర్ వీరభద్రరాజు, ఎస్.దిలీప్ ఉన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ సూచించింది. ఇదిలా ఉంటే దీనిపై కాకినాడ ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ప్రతి 12 నెలలకు ఎన్నికలు జరగాలని సుబ్రహ్మణ్యం చెప్పారు. గత ఏడాది మే 6న ఎన్నిక జరిగిందని, దీంతో తమకు మరో రెండు నెలల కాలం కావాలని రిట్ పిటీషన్ వేశామని చెప్పారు.

శెట్టిబలిజల అభివృద్ధి ప్రదాత 'దొమ్మేటి'



వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

కాకినాడ సిటీ: శెట్టిబలిజల కోసం ఎన్నో పోరాటాలను చేపట్టి అభివృద్ధి ప్రదాతగా దొమ్మేటి వెంకటరెడ్డి ఖ్యాతిగడించారని కొండిన్య శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు చింతాకుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక 8వ వార్డు సాంబమూర్తినగర్‌లో దొమ్మేటి వెంకటరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజలు ఐకమత్యంతో సాగి సంఘ అభివృద్ధికి పాటుపడాలన్నారు. సంఘ నాయకులు కాకరపల్లి చంద్రశేఖర్, కడియాల సూరిబాబు, పాలిక లోవరాజు, పలివెల సూర్యనారాయణ, తుట్ట లీలావతి, కుడుపూడి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం'



చదవడం మాకిష్టంలో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు: స్థానిక గ్రంథాలయ శాఖలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. సండే స్టోరీ పేరుతో కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరై చందమామ కథలు, అల్లాడిన్, దిప్లొంట్ కింగ్డమ్, వండర్ఫుల్ స్టోరీస్ ఆఫ్‌ది వరల్డ్, తదితర పుస్తకాలు చదివారు. దాదాపు 150 మంది విద్యార్థులకు పైగా సందర్శించగా గ్రంథాలయాధికారి ములంపాక శ్రీనివాసరావు వారి సందేహాలను నివృత్తి చేశారు.

అలరించిన గాత్ర కచేరీ



రాగాలను ఆలపిస్తున్న సంగీత విద్వాంసుడు కర్నూరి హరీష్ తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళా మందిర్‌లో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న సరస్వతీ గానసభ 19వ వార్షిక సంగీత, నృత్య నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. హిందూస్థానీ సంగీత విద్వాంసుడు కర్నూరి హరీష్ గాత్ర కచేరీ శ్రోతలను అలరించింది. హంసధ్వని, బాగేశ్వరి తదితర రాగాలాపన ఆకట్టుకుంది. తబలా విద్వాంసుడు ఉస్తాద్ నజ్ముద్దీన్ ఖాద్రి, సారంగి విద్వాంసుడు మహ్మద్ అస్లాంఖాన్‌లు సంగీత సహకారం అందించారు. దీనికి గానసభ అధ్యక్షుడు ఆంజనేయమూర్తి, కార్యదర్శి పి.రామకృష్ణ, కొమ్మురెడ్డి శ్రీరామ నరసింహమూర్తి, చెరుకుపల్లి సత్యనారాయణ, సంగీత ప్రియులు హాజరయ్యారు.

టీడీపీ ప్రచారం

కరప: గురజనాపల్లిలో ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, బుంగా సింహాద్రి, పంపన కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

కళర్‌ఫుల్‌గా..

- నాటక రంగానికి ప్రోత్సాహం
- ఆదరణ కల్పిస్తున్న పరిషత్‌లు
- నగరానికి ఖ్యాతి తెస్తున్న కళాకారులు

కాకినాడ కల్చరల్: కాకినాడ.. కళాకారులకు కేంద్రంగా, కళలకు కాణాచిగా పేరుగాంచింది. ఇక్కడ నాటక పరిషత్‌లు, నాటక రంగ సంస్థలు కళలను విశేషంగా ప్రోత్సహిస్తున్నాయి. ఔత్సాహికులను వెలుగులోకి తీసుకొస్తూ నాటక రంగానికి జీవం పోస్తున్నాయి. యువ కళాకారులను సత్కరిస్తూ వారిలో నాటక రంగంపై మరింత మక్కు పెంచేలా చేస్తున్నాయి. కాకినాడలో సీతారామరాజు స్మారక కళా వేదిక, పంతం పద్మనాభం స్మారక నాటక పరిషత్, నటీనట వర్ధమాన రంగస్థల సమాఖ్య (నవరస), మూర్తి కల్చరల్ అసోసియేషన్, మహేష్ కల్చరల్ అసోసియేషన్లు ఉన్నాయి. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు స్మారక కళావేదికను 1999లో అప్పటి మంత్రి జీఎంసీ బాలయోగి ప్రారంభించారు. కళావేదిక వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానందబాబు ఔత్సాహికులను



నవరస సారథ్యంలో ప్రదర్శించిన సుందరీ సుబ్బారావు నాటికలో ఓ ఘట్టం

ప్రోత్సహించడమే కాకుండా బాల నటులకూ శిక్షణ ఇస్తున్నారు. అల్లూరి సీతారామరాజు, ఝాన్సీలక్ష్మీబాయి వంటి నాటకాలను బాలలతో వేయించి ప్రశంసలు పొందుతున్నారు. భవిష్యత్ తరాలకు నాటకాన్ని పరిచయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. 1999లో పంతం పద్మనాభం స్మారక నాటక పరిషత్ ఆవిర్భవించింది. దీనికి అధ్యక్షుడిగా మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పళ్లంరాజు, కార్యదర్శిగా బుర్రా పద్మనాభం వ్యవహరిస్తున్నారు. సాంఘిక నాటకాలకు పరిషత్ పెట్టింది పేరు. వీరు నాటకాలు ప్రదర్శిస్తూ కళాకారులను వెలుగులోకి తెస్తున్నారు. నటీనట వర్ధమాన రంగస్థల సమాఖ్యను 1972లో దివంగత ఎస్ఎస్ఆర్‌కే గురుప్రసాద్ స్థాపించారు. ఈ సమాఖ్యకు ప్రస్తుతం అధ్యక్షుడిగా ఎస్.గోపాల్ వ్యవహరిస్తున్నారు. దీనిద్వారా ప్రదర్శిస్తున్న 'సుందరీసుబ్బారావు' హాస్య నాటిక అందరి ప్రశంసలు అందుకుంటోంది. కుటుంబ నేపథ్యంతో కూడిన నాటిక ప్రదర్శించడంలో సమాఖ్యకు మంచి పేరుంది. మూర్తి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కె.మూర్తి సమాజంలోని నైతిక విలువలకు అద్దం పట్టే విధంగా నాటికలు ప్రదర్శించి మంచి మార్పునకు తన వంతు కృషి చేస్తున్నారు. వర్ధమాన నటులను తీర్చిదిద్దుతూ కళామాతల్లి రుణం తీర్చుకుంటున్నారు. పరిషత్‌లు నాటక రంగానికి జీవం పోయాలనే తపనతో ముందుకు సాగుతున్నాయి. కళలను బతికిస్తున్నాయి.



పంతం పద్మనాభం స్మారక నాటక పరిషత్ వారి జగన్నాథ రథచక్రాలు నాటికలో ఓ సన్నివేశం

వారసత్వ సంపద ఇది



ప్రస్తుత తరానికి ఆసక్తి పెంచకపోతే నాటక రంగం కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. అందుకే యువతను తట్టి ప్రోత్సహిస్తున్నాం. ఇది మన వారసత్వ సంపదగా అందరూ భావించాలి. చదువుతో పాటు ఈ రంగంపై యువత దృష్టి సారించాలి. తమ కళా వేదిక ద్వారా యువ నటులను ప్రోత్సహించి నాటకాలు ప్రదర్శిస్తున్నాం.

– పంపన దయానందబాబు, సీతారామరాజు స్మారక కళావేదిక, వ్యవస్థాపక కార్యదర్శి

నైతిక విలువలు పెంచేవే..



నైతిక విలువలను పెంచి సమాజాన్ని సన్మార్గంలో నడిపించేవే నాటకాలు. ప్రజలను ప్రభావితం చేసే గొప్ప శక్తి ఈ రంగానికి మాత్రమే ఉంది. మంచి, చెడులను నాటకం ద్వారా ప్రదర్శించి చివరకు మంచికే న్యాయం జరుగుతుందనే భావన కల్పిస్తుంది. సమాజంలో జరిగే ఇతివృత్తాలను ఆధారం చేసుకుని నాటికలు ప్రదర్శిస్తున్నాం. ఇవి ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి.

– బుర్రా పద్మనాభం, కార్యదర్శి, పంతం పద్మనాభం స్మారక నాటక కళాపరిషత్

భవన నిర్మాణ కార్మిక సంఘాల మహాసభ

కాకినాడ సిటీ: అఖిలభారత కార్మిక సంఘాల సమాఖ్య ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక సంఘాల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రథమ మహాసభ స్థానిక ఎస్.అచ్యుతాపురంలో ఆదివారం జరిగింది. తొలుత కార్మికులు, సంఘాల ప్రతినిధులు గాంధీనగర్ నుంచి ఎస్.అచ్యుతాపురం వరకూ ప్రదర్శనను చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏఐఎఫ్‌టీయూ భవన నిర్మాణ రంగ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా రాయుడు గోవిందు, డి.నారాయణమూర్తి, గౌరవ అధ్యక్షులుగా కుంచే అంజిబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల సతీష్ పాల్గొన్నారు.

గోల్డెన్ జూబ్లీ వేడుకలపై సమావేశం

బాలాజీచెరువు: ఐడియల్ డిగ్రీ కళాశాలల గోల్డెన్ జూబ్లీ వేడుకలు వచ్చే నెల 8న నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం విద్యుత్‌నగర్ కళాశాల ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వెయ్యి మందికి పైగా పేర్లు నమోదు చేసుకున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

అక్కచెల్లెమ్మలకు ఆసరా..

- 40 వేల మందికి లబ్ధి
- రూ.28 కోట్ల పంపిణీకి సిద్ధం
- ఎనిమిది రోజుల సంబరాలు



కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలకు మరోసారి తీపి కబురు అందించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు మూడో విడత వైఎస్సార్ ఆసరా కింద ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. గత ప్రభుత్వం రుణాలు రద్దు చేస్తామనే ఇచ్చిన హామీని ఉల్లంఘిస్తే.. జగన్ సర్కార్ మాత్రం ఇచ్చిన మాట తప్పకుండా 2022–23 ఆర్థిక సంవత్సరానికి మళ్లీ ఈ ఏడాది కూడా నేరుగా ఖాతాల్లో సొమ్ము జమ చేసేందుకు సిద్ధమవుతుంది. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో నాలుగు వేల స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో సుమారు 40 వేల మంది మహిళలు ఉండగా వైఎస్సార్ ఆసరా కింద లబ్ధి పొందనున్నారు. వీరికి రూ.28 కోట్ల లబ్ధి చేకూరనుంది. ఇందుకు సంబంధించి వైఎస్సార్ ఆసరా అమలు చేస్తున్న ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు చెబుతూ కాకినాడ నగరంలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకునేందుకు స్వయం సహాయక సంఘాలు సమాయత్తమవుతున్నాయి.

నేడు నమూనా చెక్కు పంపిణీ

వైఎస్సార్ ఆసరా సంబరాలను సోమవారం నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకూ ఎనిమిది ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉండే స్వయం సహాయక సంఘాల సమక్షంలో వైఎస్సార్ ఆసరా సంబరాలను జరుపుకోనున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, మెప్మా అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక జగన్నాథపురం ఎంఎస్ఎన్ చార్టీస్ సమీపంలోని పైడా వారి స్థలంలో సోమవారం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడతారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు.

6 వరకూ సంబరాలు



మూడో విడత వైఎస్సార్ ఆసరా సొమ్ము జమ కార్యక్రమం సోమవారం నుంచి నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సంబరాలు చేస్తున్నాం. ఆయా ప్రాంతాల్లోని స్థానికంగా ఉండే స్వయం సహాయక సంఘాల లబ్ధిదారుల సమక్షంలో మెగా చెక్కు పంపిణీ జరుగుతుంది. కాకినాడ కార్పొరేషన్ పరిధిలో అర్హులు రూ.28 కోట్ల మేర లబ్ధి పొందనున్నారు.

– సీహెచ్ నాగనరసింహారావు, అదనపు కమిషనర్, కాకినాడ

వైభవంగా ముగిసిన సప్తాహం



సర్పవరంలో సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు దంపతులు

కాకినాడ రూరల్: సర్పవరం గ్రామ రామాలయంలో సప్తాహ మహోత్సవం ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దంపతులు హాజరయ్యారు. సీతారాములను దర్శించుకున్న ఆయన సప్తాహంలో ఆధ్యాత్మికతను చాటిన భజనా కళాకారులను అభినందించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ సర్పవరంలో నూతన రామాలయ నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. 50 ఏళ్లుగా భజనలతో గ్రామాన్ని పునీతం చేస్తున్న ఆలయ కమిటీని అభినందించారు. ఆలయ కమిటీ నిర్వాహకుడు పుల్ల జగన్నాయకుల గురుస్వామి, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పుల్ల కోటేశ్వరరావు, పుల్ల చందు పాల్గొన్నారు. సర్పవరం రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామి ఆలయంలో ప్రతి ఆదివారం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కన్నబాబు మాఘమాసంలో తెలపడంతో పాటు ప్రతి ఆదివారం ప్రయోగాత్మకంగా నిర్వహించాలని ఆదేశించారు. దీంతో గ్రామస్తుల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు. ఐదు ఆదివారాలుగా అన్నదానం నిర్వహించామని ఆలయ కమిటీ చైర్మన్ పుల్ల నారాయణరావు తెలిపారు. గ్రామస్తులు పుల్ల చందు, ప్రభాకరరావు, గ్రామ పెద్దలు, భక్తుల సహకారంతో అన్నదానం చేపడుతున్నామన్నారు.

శ్రీనివాసా.. భజే వేంకటేశా..



చీడిగలో పూజలు చేస్తున్న వేంకటేశ్వరస్వామి దీక్షాధారులు

కాకినాడ రూరల్: చీడిగలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామంలోని సుమారు వందేళ్ల చరిత్ర కలిగిన వేంకటేశ్వరస్వామి ఆలయం స్థానే కొత్తగా రూ.2.5 కోట్లతో దశావతార వేంకటేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మించారు. 30న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దంపతుల చేతులమీదుగా విగ్రహాల ప్రతిష్ఠాపన జరుగనుంది. దీనికోసం పూజా కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. గ్రామంలోని సుమారు 110 మంది భక్తులు వేంకటేశ్వరస్వామి దీక్షను తీసుకుని పూజల్లో పాల్గొన్నారు. రెండో రోజు ఆదివారం ఉదయం పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, ధ్వజ కుంభారాధన, అఖండ దీపారాధన, అరణిమథనం, అగ్ని ప్రతిష్ఠ, చతుస్థాన అర్చన, మూర్తులకు నవకలశ స్నపనం, నిత్య పూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. సాయంత్రం శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ, యాగశాల కుంభారాధన, మూర్తులు జలాధివాసం తదితర కార్యక్రమాలు జరిగాయి. వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పిశెట్టి గణేష్, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్తెమ్మ ఆలయం వద్ద అన్నదానం

రమణయ్యపేట ఈశ్వర్‌నగర్‌లో విజయసత్తెమ్మ తల్లి జాతర ఉత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. పెద్దఎత్తున భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. అమ్మవారిని పలువురు దర్శించుకున్నారు. ఆలయ కమిటీకి చెందిన సాంబమూర్తి, సూర్యనారాయణ, సూరిబాబు, శ్రీనివాస్, గోవిందు, పి.సూరిబాబు, అప్పలరాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సరైన తర్ఫీదుతో విజయం తథ్యం



సమావేశంలో ప్రసంగిస్తున్న కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి

కాకినాడ రూరల్: నేటి ఆధునిక సమాజంలో యువతీ, యువకులు సరైన తర్ఫీదుతో ఉద్యోగ సాధనలో విజయం సాధించవచ్చని కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కౌడా) చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి అన్నారు. కాకినాడకు చెందిన పర్పుల్ లేన్ ప్రథమ వార్షికోత్సవాన్ని రమణయ్యపేట ఎస్ఆర్ఎంటీ మాల్‌లో శని, ఆదివారాలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ప్రస్తుతం అనేక సాఫ్ట్‌వేర్ కొలువులు యువతీ యువకులను ఆకట్టుకుంటున్నాయని, డిగ్రీ మొదలుకుని, బీటెక్ వరకూ అభ్యసించిన వారు కొలువుల్లో భారీ ప్యాకేజీలు పొందుతున్నారన్నారు. కాకినాడ జిల్లా నుంచి సుమారు 200 మందికి ఉద్యోగాలు వచ్చేలా తర్ఫీదు ఇచ్చిన పర్పుల్ లేన్ సేవలు అభినందనీయమన్నారు. పర్పుల్ లేన్ సీఈఓ సంతోష్ శ్రీనివాస్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 500 మంది విద్యార్థులు తర్ఫీదు పొందుతున్నారన్నారు. మాజీ మేజర్ సుంకర శివప్రసన్న, సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ మూర్తిరాజు, నన్నయ ఎంఎస్ఎన్ పీజీ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి, పర్పుల్ లేన్ వైస్ చైర్మన్ వార వినోద్, భవాని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ కమిటీలకు సత్కారం



మైనార్టీ కమిటీలను సత్కరిస్తున్న మస్జిద్-ఏ-షరీఫైన్ మసీదు కమిటీ సభ్యులు

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో మస్జిద్-ఏ-షరీఫైన్ మసీదు కమిటీ సభ్యులు ఆదివారం మైనార్టీ కమిటీ అధ్యక్షులు, వక్ఫ్‌బోర్డు అధ్యక్షులను సత్కరించారు. ఐదు జిల్లాల మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ బషీరుద్దీన్, కాకినాడ జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, కాకినాడ సిటీ మైనార్టీ అధ్యక్షుడు ఖాలీద్‌బిన్ వలి, శీరత్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ అలీ, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి కరీంబాషా, కాకినాడ జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్లు జాఫర్‌ఖాన్, కరీముల్లాలను మసీదు కమిటీ సభ్యులు సత్కరించారు.

ప్రజా సమస్యలపై ఆరా

కాకినాడ రూరల్: నేమాంలో జనం కోసం పవన్–పవన్ కోసం మనం కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. జనసేన పీఏసీ సభ్యుడు పంతం నానాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు.

సీతారామస్వామికి పట్టువస్త్రాల సమర్పణ



సీతారామస్వామికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న సింధూష దంపతులు

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో స్వామివారికి శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం నగరానికి చెందిన సింధూష పట్టు వస్త్రాలను సమర్పించారు. సింధూష ఫ్యాషన్ డిజైనర్ కావడంతో ప్రత్యేకంగా వస్త్రాలు అందించాలని నిశ్చయించుకున్నారు. పంచెపై తులసీదళ డిజైన్, సీతమ్మ అమ్మవారి చీరపై పువ్వుల డిజైన్‌లు, రామాయణంలోని శ్లోకాలను పెయింటింగ్ చేశారు. సుమారు రూ.10 వేల విలువ చేసే ఈ పట్టు వస్త్రాలను అర్చకులకు అందజేశారు. ఆమెను ఆలయ ఈఓ బీవీఆర్ చౌదరి, ప్రధాన అర్చకుడు పాణింగపల్లి మాధవాచార్యులు అభినందించారు.

నాటక పోటీల్లో బహుమతులు



బహుమతులతో దక్షిణామూర్తి

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో శ్రీసీతారామాంజనేయ నాట్యమండలి ఏపీఎస్పీ 3 కాకినాడ నాటక సమాజానికి జాతీయ స్థాయి నాటక పోటీల్లో బహుమతులు వరించాయి. తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 20 వరకూ నిర్వహించిన జాతీయ స్థాయి పద్యనాటక, సాంఘిక నాటికల పోటీలలో 'నర్తన శాల' పద్య నాటకానికి కాకినాడ సీతారామాంజనేయ నాట్యమండలికి ద్వితీయ బహుమతి లభించింది. అలాగే ఉత్తమ ప్రతి నాయకుడిగా ఎస్‌కే అమీర్, ఉత్తమ జ్యూరీ అవార్డులను టి.కొండలరావు, బి.నాగమణి పొందారు. ఈ సందర్భంగా ఏపీఎస్పీ ఎదురుగా సీతారామాంజనేయ ఆలయంలో ఆదివారం నిర్వహించిన అభినందన సభలో నాట్యమండలి అధ్యక్షుడు ఎ.దక్షిణామూర్తి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా దక్షిణామూర్తి, నాట్యమండలి సభ్యులను ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బంది, గ్రామస్తులు, పలువురు కళాకారులు అభినందించారు. దక్షిణామూర్తి మాట్లాడుతూ నర్తన శాలలో అర్జునుడి పాత్రకు బహుమతి లభించిందన్నారు. 50 ఏళ్లుగా ఏపీఎస్పీ ఉద్యోగుల ఆధ్వర్యంలో నాట్యమండలి ద్వారా గుర్తింపు పొందామన్నారు.

ఉత్సాహంగా బాడీబిల్డింగ్ పోటీలు



పోటీలలో బాడీ బిల్డర్ల ప్రదర్శన

కాకినాడ రూరల్: ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విల్సన్ జిమ్ సహకారంతో రమణయ్యపేట ఎస్ఆర్ఎంటీ మాల్ ఎదురుగా ఖాళీ స్థలంలో ఆదివారం రాత్రి జోనల్ స్థాయి బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్– 2023 పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శ్రీకాకుళం నుంచి విజయవాడకు వరకూ ఉన్న సుమారు 12 జిల్లాలకు చెందిన బిల్డర్లు పోటీలకు హాజరయ్యారు. నిర్వాహకుడు విల్సన్ పర్యవేక్షణలో బాడీ బిల్డింగ్ ఫిజిక్ స్పోర్ట్స్ ప్రారంభ కార్యక్రమంలో కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, తదితరులు పాల్గొన్నారు. 55, 60, 70, 75, 80, 85 కిలోల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

యూటీఎఫ్ నిర్మాతలకు నివాళులు



యూటీఎఫ్ నిర్మాతలకు నివాళులర్పిస్తున్న నేతలు

కాకినాడ సిటీ: స్థానిక యూటీఎఫ్ భవన్‌లో కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో యూటీఎఫ్ సంఘ నిర్మాతలైన అప్పారి వెంకటస్వామి, వత్సవాయి సూర్యనారాయణరాజు వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ మాట్లాడుతూ అప్పారి వెంకటస్వామి యూటీఎఫ్ నిర్మాణానికి తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. అవినీతి అధికారులను వత్సవాయి సూర్యనారాయణరాజు పరుగులు పెట్టించేవారన్నారు. ఇలాంటి నాయకులను స్ఫూర్తిగా తీసుకుని యూటీఎఫ్‌ను బలోపేతం చేయడంలో సభ్యులు మరింత చురుకుగా పని చేయాలన్నారు. సీఐటీయూ నాయకుడు పలివెల వీరబాబు, యూటీఎఫ్ హోం జిల్లా అధ్యక్షుడు కేవీవీ నగేష్, నాయకులు టి.రవిచక్రవర్తి, ఐ.ప్రసాదరావు, బి.నాగమణి, పీవీఎన్ గణేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవులో ట్రాఫిక్ ఇబ్బందులు

తాళ్లరేవు: తాళ్లరేవులోని పలు సెంటర్లలో ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యంత రద్దీగా ఉండే సంతపేట, చెరువుగట్టు, దేవీమహల్ సెంటర్లలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో తిప్పలు తప్పడం లేదు. ప్రధాన రహదారి పైనే పలు వ్యాపార దుకాణాల వద్ద వాహనాలను నిలిపేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది. సంతపేట సెంటర్‌లో తోపుడు బళ్లు, రహదారి చెంతనే ఏర్పాటు చేస్తున్న వ్యాపార దుకాణాలతో భారీ వాహనాలు తప్పుకునే పరిస్థితి ఉండడం లేదు. కోరంగి పోలీసులు దృష్టి సారించాలి.

బ్యాడ్మింటన్‌లో ప్రతిభ

కాకినాడ సిటీ: గోవాలో జరిగిన యునెక్స్ సన్‌రైజ్ 45వ ఇండియన్ మాస్టర్స్ నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ 2022–23లో 75 ఏళ్ల ప్లస్ పోటీల్లో సెమి ఫైనల్స్ వరకూ చేరుకున్న కాకినాడకు చెందిన కర్రి భామిరెడ్డి, వి.శారదాదేవిలను పలువురు అభినందించారు. ఎందరో క్రీడాకారులపై నెగ్గి సెమీ ఫైనల్స్‌కు రావడం చాలా సంతోషంగా ఉందని బ్యాడ్మింటన్ క్రీడాకారులు భావిరెడ్డి, శారదాదేవి తెలిపారు. వీరు సింగిల్స్‌లో, అదే విధంగా మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో ఆడారు. ఈ పోటీలు సౌత్ గోవా జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగాయని భామిరెడ్డి తెలిపారు.



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు భామిరెడ్డి, శారదాదేవి